

సభలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి: ఎస్పీ

బెలగాం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించాలన్నా ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అనుమతుల కోసం సంబంధిత పోలీస్ స్టేషన్లలో వారం రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసే వ్యక్తుల పూర్తి వివరాలు, ఏ సభ నిర్వహిస్తారు, ఎంతమంది వస్తారు, ప్రారంభ సమయం, ముగింపు సమయం, రూట్ మ్యాప్, స్థలం తదితర వివరాలు దరఖాస్తులో పొందుపరచాలి. దరఖాస్తు ఫారం ఎస్‌హెచ్‌వో అధికారుల వద్ద లభ్యమవుతుంది.' అని ఎస్పీ తెలిపారు.

ముగిసిన ఉపాధ్యాయ బదిలీలు

- 1,514 మంది

ఎస్జీటీలకు స్థానచలనం

సాలూరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ఆదివారం ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 1,514 మంది ఎస్జీటీలకు స్థానచలనం జరిగింది. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, పీఎస్‌హెచ్‌ఎం, పాఠశాల సహాయకుల బదిలీలు, పదోన్నతల ప్రక్రియ పూర్తయ్యింది. ఈ నెల 12 నుంచి వారు విధులకు హాజరవుతున్నారు. అయితే, వెబ్ కౌన్సెలింగ్‌పై ఎస్జీటీలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో, వారికి ఈ నెల 11 నుంచి మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో 2,210 మంది ఎస్జీటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఖాళీల దృష్ట్యా తప్పనిసరి బదిలీలు కావాల్సిన వారికి అనుమతించారు. దీంతో 1,514 మంది బదిలీలయ్యారు. ఎస్జీటీల బదిలీ ముగియడంతో వారికి ఆర్డర్స్ జారీ చేస్తున్నారు. సోమవారం వారు కొత్త పాఠశాలల్లో చేరనున్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా నిర్వహించడంపై ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతి హర్షం వ్యక్తం చేశారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

- ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం
- పిల్లలకు సన్నబియ్యంతో భోజనం
- ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహం
- 'తల్లికి వందనం' వర్తింపు
- విద్యామిత్ర కిట్ల పంపిణీ



పార్వతీపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థను బలోపేతంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. దీనిలో భాగంగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో 45 రకాల యాప్‌లను పెట్టి విద్యావ్యవస్థను గందరగోళం చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకంతో పాటు ప్రతి కార్యక్రమానికీ ఒక యాప్ పెట్టి ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశారు. వారితో టాయిలెట్ల ఫొటోలు తీయించారు. విద్యార్థులకు ఇచ్చే పుస్తకాలు, బెల్టులు, బ్యాగులు, చిక్కీలపై జగన్ ఫొటలు, పేర్లు వేసుకున్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను ఎత్తేసి హైస్కూళ్లలో కలిపేశారు. వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులపై గౌరవం లేకుండా వ్యవహరించేది. దీంతో ఉపాధ్యాయ సంఘాలు ఎప్పటికప్పుడు రోడ్డెక్కి ఆందోళన చేసే పరిస్థితి ఉండేది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. యాప్‌ల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించింది. కేవలం బోధనకే వారిని పరిమితం చేసింది. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా స్కూళ్లు ప్రారంభంరోజే ప్రతి విద్యార్థికి రూ.2,279 విలువైన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్‌ల ఉచితంగా అందించారు. ఈ కిట్‌లో పాఠ్యపుస్తకాలు, నోట్, వర్క్ బుక్‌లు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, మూడు జతల యూనిఫారం, బ్యాగ్, బూట్లు, 2 జతల సాక్సులు, బెల్ట్ ఉన్నాయి. ఒకటో తరగతి

(మిగతా 8వ పేజీలో..)



సాలూరు: కూనంబందవలసలో సన్నబియ్యంతో వండిన అన్నం తింటున్న విద్యార్థులు (ఫైల్)



గుమ్మలక్ష్మీపురం: చింతగూడవీధి పాఠశాలకు చేరిన పుస్తకాలు

బాధను దిగమింగి.. బిడ్డల కోసం శ్రమిస్తూ..

- భర్త చనిపోయినా పిల్లలను పోషించుకుంటున్న తల్లి
- ఇళ్లల్లో పనిచేస్తూ వారిని ఉన్నత చదువులు చదివిస్తున్న వైనం
- ఆదర్శంగా సునీత
- నేడు అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం



ఓ ఇంట్లో అంట్లు తోముతున్న సునీత

సాలూరు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రమణమ్మా.. వేడినీళ్ల పెట్టు... జయమ్మా.. ఆ డ్రెస్సులు కాస్త మడత పెట్టు...కాస్త ఇంటి ముందు ముగ్గు వేసెయ్... ఉద యం వేళల్లో అనేక ఇళ్లలో నిత్యం ఇలాంటి మాటలు వినడం మనకు అలవాటే. ఆ రమణమ్మలు.. జయమ్మలు లేకపోతే ఎంత ఇబ్బంది పడుతుంటామో ఇల్లాళ్లు చెబుతుండడమూ మనకు తెలిసిందే. ఇలా ఇంటి అవసరాలన్నీ తీర్చే వారే గృహ కార్మికులు. మరో ఇంటిలో రెక్కలు ముక్కలుగా చేసుకొని కష్టపడే గృహ కార్మికుల శ్రమ వెనుక కనిపించని కష్టాలు..కన్నీళ్లు ఎన్నో. అంతేకాదు.. ఇలా కష్టపడుతూనే తమ బిడ్డలను ఉన్నతంగా తీర్చిదిద్దిన వారూ ఎందరో ఉన్నారు. సోమవారం అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా కథనం.. సాలూరుకు చెందిన పిట్టా సునీత అనే మహిళ పలువురి ఇళ్లల్లో కార్మికురాలుగా పనిచేస్తోంది. ఆమె భర్త పిట్టా నాగరాజు రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త చనిపోక ముందు నుంచే కుటుంబ పోషణ కోసం ఆమె పలువురి ఇళ్లల్లో పని చేయడం ప్రారంభించింది. ఇళ్లల్లో పనిచేస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తోంది. కుమారుడు గోవర్ధన్ ఐటీఐ పూర్తి చేశాడు. ఇటీవల డీజిల్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమ పట్టా తీసుకున్నాడు. రైల్వేలో ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాడు. కుమార్తె తేజశ్రీ ఇంటర్మీడియట్ చదివింది. ఇటీవల ఏపీఈఏపీ సెట్‌లో 30 వేలు ర్యాంకు వచ్చింది. దీంతో కన్వీనర్ కోటాలో ఏజీ బీఎస్సీ, ఫార్మసీ కోర్సులో చేరేందుకు ప్రయత్నాలు చేస్తోంది. 'నా భర్త గతించారు. ఆ బాధను దిగమింగుకుంటూ పిల్లలను పోషించడానికి ఇళ్లల్లో పనులు చేయడానికి వస్తున్నాను. ఇంటి యాజమానుల మంచితనంతో కాలం వెళ్తుంది. నా పిల్లలను బాగా చదివించుకుంటున్నాను. వితంతు పింఛను కోసం ఎదురు చూస్తున్నా ను.' అని సునీత తెలిపారు.

'యోగాంధ్ర'లో సత్తాచాటాలి

- డీఆర్వో హేమలత
- రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విజేతలు



ఎన్టీఆర్ జిల్లాకు పయనమైన యోగా పోటీల విజేతలు

పార్వతీపురం/బెలగాం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో సోమ, మంగళవారం నిర్వహించే రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాస్థాయి విజేతలు ఆదివారం కలెక్టరేట్ నుంచి బస్సులో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా డీఆర్వో హేమలత మాట్లాడుతూ.. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయిలో కూడా సత్తా చాటాలన్నారు. మన్యం జిల్లా పేరు, ప్రతిష్ఠలను పెంచాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని తిరిగి స్వస్థలాలకు చేరుకునే వరకూ వారికి సహాయ, సహకారాలు అందించేందుకు నోడల్ అధికారిగా ట్రైబల్ వెల్ఫేర్ డీడీ కృష్ణవేణి, లైజన్ ఆఫీసర్‌గా డా.రఘు, యోగా మాస్టర్ మోహన్ గంటాయత్, వివిధ శాఖల అధికారులను నియమించారు. కార్యక్రమంలో యోగాంధ్ర జిల్లా కన్వీనర్ డా.టి.జగన్మోహన్‌రావు, ఏవో సీహెచ్.రాధాకృష్ణ, డీటీ లక్ష్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లు నరికివేత

- పట్టించుకోని అధికారులు
- ప్రజల ఆగ్రహం

జియ్యమ్మవలస, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ రహదారులకు ఇరువైపులా ఉన్న విలువైన చెట్లు గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఓ వైపు మొక్కలు నాటుతుంటే.. మరోవైపు కొందరు వ్యక్తులు రోడ్లపక్క ఏపుగా పెరిగిన పచ్చని చెట్లను నరికేస్తున్నారు. ఇష్టారాజ్యంగా చెట్లను నరికేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మోఖాసా అల్లువాడ - తుంబలి, జోగులడుమ్మ - జియ్యమ్మవలస గ్రామాల మధ్య ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు కొందరు రైతుల గొడ్డలి వేటుకు నేలకొరుగుతున్నాయి. పెదతుంబలి, చినతుంబలి గ్రామాల మధ్య ఇటీవల పదుల సంఖ్యలో చెట్లను నరికేసి

(మిగతా 8వ పేజీలో..)



గడ్డికి నిప్పు పెట్టడంతో కాలిపోతున్న చెట్లు



అల్లువాడ సమీపంలో భారీ వృక్షాన్ని నరికేస్తున్న దృశ్యం(ఫైల్)

ఆ కష్టం వెనుక కన్నీళ్లెన్నో
- తమ ఇంటి అవసరాల కోసం కార్మికులుగా మారి
- ఇళ్లల్లో పనులు చేస్తూ ఉపాధి
7లో

కార్మిక చట్టాన్ని సవరించండి
- కార్మికుల బైక్ ర్యాలీ
7లో

ఆక్రమణలపై చర్యలేవీ?
- పంట పొలాలకు మార్గం లేక ఇబ్బంది పడుతున్న రైతులు
- స్పందించని అధికారులు
8లో

టీడీపీ నియోజకవర్గ పరిశీలకుల నియామకం
8లో

సీఎం సహాయ నిధి పంపిణీ చేసిన మంత్రి
8లో

12 మండలాల్లోనూ శిథిలావస్థలోనే..

- ఇదీ మండల వనరుల కేంద్రాల పరిస్థితి
- వర్షం కురిస్తే అంతే..
- కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు
- బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు
- వాటి నిర్మాణానికి హామీ ఇచ్చి మరిచిపోయిన వైసీపీ
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



అధ్వానంగా దర్శనమిస్తున్న మరుగుదొడ్లు



సెప్టిక్ ట్యాంకుకు భారీగా గొయ్యి పడిన దృశ్యం



శిథిలావస్థలో ఉన్న గరుగుబిల్లి మండల వనరుల కేంద్రం

గరుగుబిల్లి, జూన్15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల మండల వనరుల కేంద్రాలు (ఎమ్మార్సీ) అధ్వానంగా తయారయ్యాయి. భవనాలన్నీ శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షం కురిస్తే కార్యాలయాలన్నీ కారిపోతున్నాయి. గదుల్లోకి నీరు చేరడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. జిల్లాలో పాలకొండ, పార్వతీపురం, సీతానగరం మండలాలు మినహా మిగిలిన 12 మండలాల్లో ఎమ్మార్సీ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. నాడు-నేడు కింద వాటి నిర్మాణాలు చేపడతామని గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయింది. దీంతో ఆయా భవనాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గరుగుబిల్లి ఎమ్మార్సీకి చెందిన పుస్తక సామగ్రితో పాటు పలు రకాల పరికరాలను జడ్పీ హైస్కూల్‌లో భద్రపరుస్తున్నారు. గతంలో వర్షం కారణంగా సామగ్రి మొత్తం పనికిరాని విధంగా తయారైంది. అప్పట్లో భవన మరమ్మతులకు కొంతమేర ఆర్థిక సాయం అందినప్పటికీ పరిస్థితి మారలేదు. ఎమ్మార్సీకి ఆనుకుని ఉన్న మరుగుదొడ్లు కూడా అధ్వానంగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మార్సీల నిర్వహణకు ఏటా నిధులు కేటాయించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వాటికి మంగళం పాడింది. గత ఐదేళ్లగా ఎమ్మార్సీ భవనాలను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిపై దృష్టి సారించాల్సి ఉంది. ఉపాధి హామీ పథకంలోనైనా ఆయా భవనాలకు మరమ్మతులు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు. ఎమ్మార్సీ భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని గరుగుబిల్లి ఎంఈవో దత్తి అప్పలనాయుడు తెలిపారు.

ఆ కష్టం వెనుక కన్నీళ్లెన్నో..

- తమ ఇంటి అవసరాల కోసం కార్మికులుగా మారి
- ఇళ్లల్లో పనులు చేస్తూ ఉపాధి
- నేడు అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం

రమణమ్మా.. వేడినీళ్లు పెట్టు... జయమ్మా.. ఆ డ్రెస్సులు కాస్త మడత పెట్టు...కాస్త ఇంటిముందు ముగ్గు వేసెయ్... ఉదయం వేళల్లో అనేక ఇళ్లలో నిత్యం ఇలాంటి మాటలు వినడం మనకు అలవాటే. ఆ రమణమ్మలు..జయమ్మలు లేకపోతే ఎంత ఇబ్బంది పడుతుంటామో ఇల్లాళ్లు చెబుతుండడమూ మనకు తెలిసిందే. ఇలా ఇంటి అవసరాలన్నీ తీర్చే వారే గృహ కార్మికులు. మరో ఇంటిలో రెక్కలు ముక్కలుగా చేసుకొని కష్టపడే గృహ కార్మికుల శ్రమ వెనుక కనిపించని కష్టాలు..కన్నీళ్లు ఎన్నో. అంతేకాదు..ఇలా కష్టపడుతూనే తమ బిడ్డలను ఉన్నతంగా తీర్చిదిద్దిన వారూ ఎందరో ఉన్నారు. సోమవారం అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా కథనం..



రాజాం వస్త్రపురి కాలనీకి చెందిన ఇమంది జయ్యమ్మ భర్త జ్యూట్ మిల్లు కార్మికుడు కొన్నేళ్ల కిందట మృతిచెందాడు. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారు. భర్త దూరమైన జయమ్మ ఇళ్లల్లో పనులు చేసి ముగ్గురు కుమారులను చదివించింది. తాను పస్తులుంటూ పిల్లల కడుపు నింపింది. ముగ్గురినీ చదివించి ప్రయోజకులను చేసింది. పెద్ద కుమారుడు విశ్వనాథం పోస్టల్ ఉద్యోగి. రెండో కుమారుడు పార్వతీశం పొగాకు కంపెనీలో ఉద్యోగి. మూడో కుమారుడు త్రిమూర్తులు సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగిగా ఎంపికయ్యాడు. ఈ ముగ్గు రినీ పెంచి, చదివించేందుకు ఎన్నో వ్యయప్రయాసలకు గురయ్యానని.. అవమానాలు, ఛీత్కారాలు ఎదుర్కొన్నానని జయ్యమ్మ కన్నీటి పర్యంతమవుతోంది. అయినా ఆత్మవిశ్వాసమే నడిపించిందని చెబుతోంది.

పిల్లలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే

గంజిపేటకు చెందిన పి.సత్యవతి ఇళ్లలో పనులు చేస్తుంటే.. భర్త కూలి పనులకు వెళతాడు. భార్యభర్తలిద్దరూ కష్టపడి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. వీరి కష్టాన్ని గుర్తించి కూతురు, కొడుకు ఎంతో కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. కూతురు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తుండగా.. కొడుకు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఉన్నత చదువులు చదువుతున్నారు

స్టేడియంపేటకు చెందిన ఆర్.సత్యవతికి భర్త నుంచి సహకారం లేదు. మూడిళ్లలో పనిచేస్తూ తన కూతురిని స్టాఫ్ నర్సు కోర్సు చదివిస్తోంది. పాప భవిష్యత్తులో స్థిరపడే వరకూ తాను ఎంతైనా కష్టపడతానని సత్యవతి చెబుతోంది. ఇళ్ల యజమానులు కూడా తనకు ఎంతో సహకరిస్తున్నారని చెబుతోంది.

రాజాం/ విజయనగరం దాసన్నపేట, జూన్15 (ఆంధ్రజ్యోతి): గృహ కార్మికులంటే ఇళ్లలో పని చేసేవారు. ఇది అనాదిగా వస్తున్న వ్యవస్థ. రైతు కుటుంబాల్లో దశాబ్దాల కిందట ఎక్కువగా ఈ తరహా గృహ కార్మికులు కనిపించేవారు. ఒకప్పుడు ఏడాదికి ఇంత ధాన్యం, నగదు అంటూ ఒప్పందం చేసుకునేవారు. వీరిలో పురుషులు, మహిళలు ఉండేవారు. ఉదయం నుంచి రాత్రి వరకూ రైతు వద్ద పనిచేయాలి. మూడు పూటలా భోజనం, ఏడాదికి కొన్ని వస్త్రాలు వారికి అందించేవారు. వారి బాగోగులను సంబంధిత రైతే చూసేవాడు. అయితే వ్యవసాయంలో యాంత్రీకరణ వచ్చింది. సాగుపట్ల ఆసక్తి తగ్గింది. ఈ వ్యవస్థ పూర్తిగా కనుమరుగైంది. ఇప్పుడంతా రోజువారి వేతనంతో పని చేసేవారు వ్యవసాయంలో కనిపిస్తున్నారు.

పట్టణాల్లో ఎక్కువగా...

పట్టణాల్లో ఇప్పుడు ఎక్కువగా గృహ కార్మికులు కనిపిస్తున్నారు. గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లే కుటుంబాల వారు ఇలా గృహ కార్మికులు పనికి కుదురుతున్నారు. అపార్ట్‌మెంట్ సంస్కృతి వచ్చిన తరువాత ఓ కుటుంబం అక్కడ చేరుతోంది. ఆ అపార్టుమెంటుల్లో నివసించే కుటుంబాలకు సంబంధించి దుస్తులు ఉతకడం, ఇస్త్రీ చేయడం వంటివి భర్త చూస్తుంటాడు. ఇక భార్య ఇంట్లో అంట్లు తోమడం వంటివి చేస్తుంటారు. దంపతులిద్దరూ విధి నిర్వహణకు వెళితే ఈ గృహ కార్మికులే ఆ ఇంటి సహాయకులుగా ఉంటారు. మరో అడుగు వేస్తే ఇదే గృహ కార్మికులు కేర్ టేకర్లుగా కూడా చేరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఇంటి పని వారికి కనీస వేతనం ఇవ్వాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గృహ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి. ఇంటి పనివారలపై జరుగుతున్న వేధింపులను నివారించాలి. వీరికి ఈ-శ్రమ్ కార్డులు అందించేందుకు కృషి చేశాం,

- పి.చిట్టిబాబు, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

సరైన గుర్తింపు లేక...

గృహ కార్మికులకు సరైన గుర్తింపు లేదు. ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు సమాజంలో శ్రమించే అన్నివర్గాలను గుర్తించారు. కానీ.. ఇళ్లల్లో పనిచేసే వారికి సరైన గుర్తింపు లేదు. దీంతో వీరు ఎంతమంది ఉంటారో తెలియని పరిస్థితి. అందుకే ప్రభుత్వాల నుంచి కూడా ఆశించిన స్థాయిలో సాయం అందడం లేదు. ప్రభుత్వం ఈ వర్గాలపై దృష్టి పెడితే కొంత బాగుంటుంది.

మూడు వేలకుపైగా...

విజయనగరం జిల్లాలో 3 వేలకు పైగా ఇంటి పనివారు ఉన్నారు. వీరికి సరిపడా వేతనం కూడా లేదు. వీరందరికీ ఓ సంఘం ఉంది. డొమెస్టిక్ ఫెడరేషన్‌ని ఏర్పాటు చేశారు. వీరి సమస్యలపై ఈ ఫెడరేషన్ పోరాడుతోంది. వీరిలో కొంతమంది రోజంతా కష్టపడుతూ తమ బిడ్డలను ఉన్నత స్థాయిలో నిలబెట్టారు.



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న ఇంటిపనివారులు సంఘం ప్రతినిధులు (ఫైల్)

ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమణ



విజయనగరం, జూన్15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (ఏపీఎన్‌జీవో) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డీవీ రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాలుగుసార్లు ఆయన బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ ఎన్నిక కావడంతో సంఘ నాయకులు, ఉద్యోగులు అభినందించారు.

ఈకేవైసీ తప్పనిసరి

రాజాం, జూన్15 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కావాలంటే ఈకేవైసీ చేయించుకోవడం తప్పనిసరి అని రాజాం ఏడీఏ చంద్రరావు అన్నారు. ఆదివారం రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల పరిధిలోని అన్ని రైతు సేవాకేంద్రాలలో వ్యవసాయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు రైతులకు ఈకేవైసీ చేస్తున్నారన్నారు. ఆధార్ లింక్ అయిన బ్యాంకులకు వెళ్లి కూడా ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు. రాజాం మండలంలో 13,542 మంది, వంగరలో 8,233, సంతకవిటిలో 19,247, రేగిడిలో 17,091 మంది రైతులు ఉన్నారన్నారు. అయితే ఇప్పటి వరకూ సుమారు 2 వేల మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులు ఈనెల 20లోపు ఈకేవైసీ చేయించుకోవాలని ఏడీఏ స్పష్టం చేశారు.

ఆలయాల్లో 'యోగాంధ్ర'

శృంగవరపుకోట రూరల్, జూన్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం సమీపంలోని సన్యాసేశ్వరస్వామి ఆలయం, కొట్టాం కోటమ్మ తల్లి ఆలయాల్లో ఈవోలు ప్రసాద్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగాసనాలు వేయించి వాటి ప్రయోజనాలను వివరించారు. అలాగే, మండలంలోని భర్తపురంలో గల కల్యాణప్రసన్న వైభోగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎస్.కోట యోగా శిక్షకుడు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహించారు.

నవధాన్యాల సాగుతో మేలు

సంతకవిటి, జూన్15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల సాగుతో పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి పాత్రుని వెంకటరమణ అన్నారు. ఆదివారం మండలంలోని గుళ్లసీతారాంపురానికి చెందిన ఆదర్శ రైతు కంబాల దాలప్పడు 6 ఎకరాల్లో నవధాన్యాల సాగు చేశారు. 18 రకాల విత్తనాలను చల్లారు. ఎకరాకు 8 నుంచి 10 టన్నుల పచ్చిరొట్టి తయారవుతుందని ఆయన తెలిపారు. దీంతో పెట్టుబడి తగ్గుతుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు.

వివేకానంద ఆశయాలు అనుసరణీయం



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, జూన్15 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద ఆశయాలు యువతకు అనుసరణీయమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. స్థానిక ఫ్లైవోవర్ సమీపంలోని రామకృష్ణ ధ్యానమందిరం వద్ద ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆమె ఆదివారం ఆవిష్కరించారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు స్వామి వ్యాజ్యాందజీ మహరాజ్, పరిత్యాయనందజీ మహరాజ్, వేదప్రియానందజీ మహరాజ్, రామకృష్ణ సేవాసమితి కార్యదర్శి జగన్నాథరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలను ప్రదానం చేస్తున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, జూన్15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శిష్టకరణ విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సాహించేందుకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్నామని ఆల్ ఇండియా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు డీవీ కృష్ణారావు, శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలిమహంతి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి బెలగాం జయబాబు అన్నారు. ఆదివారం నగరంలోని కె.ఎల్.పురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శిష్టకరణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంపీ గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం, ఆది దంపతులకు సత్కారాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నామన్నారు. జిల్లాలోని పేద శిష్టకరణ కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు సంఘం సహాయ, సహకారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సుధాకర్ పట్నాయక్, రేగా సురేష్, వెంకటేష్, వరప్రసాద్, బలివాడ వెంకటరమణారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో జనసేన నాయకులు

భోగాపురం, జూన్15 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని పెద్ద హరిజన వీధికి చెందిన 20 కుటుంబాలు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. మండలంలోని ముంజేరు సమీపంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు లోకం ప్రసాద్, పల్లంట్ల జగదీశ్, బొల్లు త్రినాథ్, మాతా నవీన్ ఆధ్వర్యంలో వారు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, కూటమి ప్రభుత్వం పనితీరు నచ్చి పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు.

ఉత్తమ తండ్రులకు సత్కారం



సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

రాజాం, జూన్15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం రాత్రి ఫాదర్స్ డేను స్నేహం అసోసియేషన్ ఘనంగా నిర్వహించింది. అంబికా కోటేశ్వరరావు, పెంకి గౌరీశ్వరరావు, బి.పంచముఖేశ్వరరావు, దాసరి అప్పారావు, కొల్లూరి సత్యనారాయణలను సత్కరించారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, కె.మధుసూదనరావు, బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, గట్టి పాపారావు, కొత్తా రమేశ్, నీలకంఠేశ్వర యాదవ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

వంగర, జూన్15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. కొప్పరవలసలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. అనంతరం రుషింగి రాజులగుమ్మడ, వీవీఆర్‌పేట, బంగారువలసల్లో రహదారుల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి పక్కా రహదారి, ప్రతీ ఎకరాకు సాగునీరు అందించటమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బొత్స వాసుదేవరావు, పైల వెంకటరమణ, ఎల్.కృష్ణమూర్తి, మోహనరావుతో రమేశ్, దుర్గారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

విజయనగరం కలెక్టరేట్, జూన్15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెవెన్యూ హోంలో ఆదివారం రెవెన్యూ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక జరిగింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధ్యక్షులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా తాడ్డి గోవింద, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పి.ఆదిలక్ష్మి, వీవీఆర్ జగన్నాథరావు, సాయికృష్ణకుమార్, ఆర్.శంకరరావు, కార్యదర్శిగా ఐ.సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా సంజీవ్‌కుమార్, క్రీడలు-సాంస్కృతిక కార్యదర్శిగా వి.ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా హరికిరణ్, వి.నారాయణమ్మ, ఎ.రామారావు, కె.రమేష్, కోశాధికారిగా జోగినాయుడు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్‌వీవీఎస్ మూర్తి, వి.సత్యనారాయణ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందించారు.

అన్నా క్యాంటీన్‌కు రూ.10 వేల విరాళం

విజయనగరం రూరల్, జూన్15 (ఆంధ్రజ్యోతి): డెంకాడ మండలం బంగార్రాజుపేటకు చెందిన ఎన్.రామారావు, యామిని దంపతులు తమ కుమార్తె నూతన వికాసిని జన్మదినం సందర్భంగా అన్నా క్యాంటీన్‌రూ రూ.10 వేల విరాళం అందజేశారు. ఆదిరం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు ఆ మొత్తాన్ని అందజేశారు. అన్నా క్యాంటీన్‌కు విరాళం అందజేసిన వారిని ఆమె అభినందించారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక రేపు

మెంటాడ, జూన్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇద్దనవలస విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో 17న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నామని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనంతరావు తెలిపారు. ఆదివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని చల్లపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్ క్యాంప్ కోర్టుపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

నిరుపేద మహిళలకు నిత్యావసరాలు

విజయనగరం దాసన్నపేట, జూన్15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కణపాకలో 35 మంది నిరుపేద మహిళలకు ఆదివారం నిత్యావసర సరుకులను తిరుపతి నవజీవన్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టరు కె.శ్రీధర్ ఆచార్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతినెలా నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. ట్రస్టు మేనేజర్ ఎస్‌వీ రమణ, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

డెంకాడ, జూన్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కివరం సమీపంలో గల జాతీయ రహదారి పక్కన ఆదివారం విద్యుత్ స్తంభానికి బూర సూరిబాబు (34) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. భోగాపురం మండలం సవరవెల్లి పంచాయతీ రామదాసపేట గ్రామానికి చెందిన సూరిబాబు ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా పని చేయడం మానేసి మద్యానికి బానిసయ్యాడు. కుటుంబం బాగోగులపై దృష్టి పెట్టడం మానేశాడు. భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు మొదలయ్యాయి. దాంతో సూరిబాబు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కార్మిక చట్టాన్ని సవరించండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

విజయనగరం దాసన్నపేట, జూన్15 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాన్ని సవరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పలరాజు డిమాండ్ చేశారు. శనివారం కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పూసపాటిరేగ నుంచి విజయనగరంలోని కోట జంక్షన్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవరించిన బిల్లుతో పని గంటలు 9 నుంచి 10 గంటలకు పెరుగుతాయన్నారు. విశ్రాంతి, విరామానికి ముందు పని సమయాన్ని 5 నుంచి 6 గంటలకు పెంచడం, మహిళా గార్డులు రాత్రి షిఫ్టుల్లో పనిచేయడం సమస్యలు ఎదురవుతాయన్నారు. తక్షణమే కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బిల్లును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

- కళ్లెంపూడి రహదారి గోతుల్లో కూర్చుని నిరసన



గోతిలో చేరిన నీటిలో ఆందోళన చేస్తున్న ప్రజలు

వేపాడ జూన్ 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బొద్దాం-కళ్లెంపూడి రహదారిని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఆదివారం బొద్దాం జంక్షన్ సమీపంలో కళ్లెంపూడి రహదారి గోతుల్లోని వరద నీటిలో కూర్చుని కళ్లెంపూడి, ముకుందపురం తదితర గ్రామాల ప్రజలు ఆందోళన చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బొద్దాం-కళ్లెంపూడి రోడ్డు దాదాపు పదేళ్లుగా అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథులే కరువయ్యాయన్నారు. ఇదే బొద్దాం, కళ్లెంపూడి, ఓబులయ్యపాలెం, ముకుందపురం తదితర గ్రామాలకు ప్రధాన రహదారి అన్నారు. రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాకాలంలో మోకాళ్ల లోతు నీటిలో రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు చల్లా జగన్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రోడ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేయకపోవడం అన్యాయమన్నారు. ఎంతో మంది వాహనదారులు ఈ రోడ్డుపై క్షతగాత్రులయ్యారన్నారు. బొద్దాం నుంచి కాకులపాలెం వెళ్లే రోడ్డుకు డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో రోడ్డుపైనే వరదనీరు నిలుస్తోందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్పందించిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలన్నారు. లేకుంటే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు. ఆందోళనలో సీపీఎం నాయకుడు చలుమూరి శ్యామ్, పచ్చిపులుసు నగేష్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

29న మహాసభ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, జూన్15 (ఆంధ్రజ్యోతి): కె.ఎల్.పురంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 29న నిర్వహించనున్న సీఐటీయూ నాలుగో నగర మహాసభలను అందరూ జయప్రదం చేయాలని నగర అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహనరావు, బి.రమణ పిలుపునిచ్చారు. ఆదివారం ఎల్‌బీజీ భవనంలో మహాసభ కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కార్మిక వర్గంపై ప్రభావం, మూడేళ్లుగా సీఐటీయూ చేసిన పోరాటాలపై సమీక్షిస్తామన్నారు. అలాగే భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డి శంకరరావు, ఆదినారాయణ, గురుమూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి



విజయనగరం: మాట్లాడుతున్న పరిశీలకుడు ఎస్‌వీఎస్ఎన్ వర్మ



భోగాపురం: ఆనందబాబును సన్మానిస్తున్న బంగార్రాజు

విజయనగరం రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఆర్కెబీచ్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అందరూ విజయవంతం చేయాలని కార్యక్రమం విజయనగరం పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ కోరారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి అశోక్ బంగ్లాలో టీడీపీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. 21న జరిగే కార్యక్రమానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరుకానున్న దృష్ట్యా విజయనగరం నుంచి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా యోగా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వాకర్స్ క్లబ్‌లు, స్వచ్ఛంద సేవాసంస్థలు, కోచింగ్ సెంటర్లు, క్రీడా సంఘాలు, క్రీడాకారులు, యోగా కేంద్రాలు, బ్రహ్మకుమారీలు నియోజకవర్గంలోని అన్నివర్గాల వారిని భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, కర్రోతు నర్సింగరావు, కంది మురళీనాయుడు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, టీడీపీ మహిళా విభాగం నాయకులు పత్తిగిల్లి సూర్యకుమారి, అనురాధ బేగం పాల్గొన్నారు.

- భోగాపురం: విశాఖలో ఈనెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవాన్ని అందరూ విజయవంతం చేయాలని యోగాంధ్ర అబ్జర్వర్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు. మండలంలోని పోలిపల్లిలో ఆదివారం యోగాంధ్ర విజయవంతానికి మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అధ్యక్షతన టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ విశాఖలో తలపెట్టిన యోగా దినోత్సవానికి పెద్దఎత్తున యువత హాజరు కావాలన్నారు. బంగార్రాజు మాట్లాడుతూ యోగా అనేది ఆరోగ్యం కాపాడుకోవడం కోసమేనన్నారు. ఈ సందర్భంగా ఆనందబాబును బంగార్రాజు సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నజీర్, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్, కడగల ఆనంద్‌కుమార్, పతివాడ అప్పల నారాయణ, పతివాడ తమ్మునాయుడు, ఆకిరి జగన్మోహనరావు, కర్రోతు రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

(ఐదో పేజీ తరువాయి)

విద్యార్థులకు పిక్టోరియర్ డిక్షనరీ ఇచ్చారు. వీటిపై ఎలాంటి రాజకీయ రంగులు, బొమ్మలు లేవు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి నగదు బహుమతి, అవార్డులను అందించారు. జిల్లాలో ఒక్కొక్క విద్యార్థికి రూ.20 వేలు చొప్పున 95 వేల మందికి నగదు ప్రోత్సాహం అందించారు. అలాగే, తల్లికి వందనం పథకం కింద ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.13వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమచేశారు. జిల్లాలో ఈ పథకం కింద 1,08,957 మంది పిల్లలకు రూ.163.43 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. 59,600 మంది తల్లుల ఖాతాల్లో నగదును జమ చేయడం ప్రారంభించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక ఇంటిలో ఒక విద్యార్థికి మాత్రమే అమ్మఒడి పథకం అందించారు. అలాగే, పాఠశాలల నిర్వహణకు భారీగా నిదులు మంజూరు చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, ఎంఆర్‌సీల నిర్వహణకు రూ.1.20కోట్లు మంజూరు చేసింది. ఇలా విద్యావ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చని చెట్ల నరికివేత

(ఐదో పేజీ తరువాయి)

ఆ రెండు గ్రామాల రైతులు తమ ఇంటి అవసరాలకు తీసుకెళ్లిపోయారు. పెదతుంబలి సమీపంలో వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రధాన కాలువ పక్కనే రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను కాల్చి బూడిద చేసేశారు. ఇదే పరిస్థితి శిఖబడి జంక్షన్ - బీజే పురం గ్రామాల మధ్య నెలకొంది. అల్లువాడ సమీపంలో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న భారీ వృక్షం నీడ తమ పొలంపై పడుతుందని, దీనివల్ల పంటలు దెబ్బతింటున్నాయని ఆ గ్రామానికి చెందిన ఓ రైతు రెండు రోజుల కిందట ఆ చెట్టును నరికి వేయించాడు. వేసవిలో ఎండ తీవ్రతకు వాహన చోదకులు ఆ చెట్టు నీడ కిందనే సేదతీరేవారు. ఇప్పుడు ఆ భారీ వృక్షాన్ని కొట్టేయడంతో నీడ కరువైందని వాహన చోదకులు వాపోతున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం ఇచ్చినా కనీస చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఈ ఏడాది మార్చిలో పెదబుడ్డిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న విలువైన నీలగిరి, టేకు, తదితర చెట్లను కొందరు నరికేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. డిప్యూటీ డీఈవో, మండల విద్యాశాఖ అధికారులు వెళ్లి సమగ్ర దర్యాప్తు నిర్వహించి నిజమని తేల్చారు. ఉన్నతాధికారులకు నివేదికలు అందించినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

చర్యలు తీసుకుంటాం

రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లను నరకడం నేరం. ఒక వేళ వాటిని నరకాలంటే రెవెన్యూశాఖ అనుమతి తప్పనిసరి. అటవీ ప్రాంతంలో అయితే అటవీశాఖ అనుమతి ఉండాలి. అనుమతి లేకుండా చెట్లను నరికితే చర్యలు తీసుకుంటాం.

- ఎ.సుశీల, ఏఈ, ఆర్‌అండ్‌బీ, జియ్యమ్మవలస

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

పాలకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కార్మికుల నడ్డి విరిచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్స్ రద్దు అయ్యేంతవరకు ఐక్యంగా పోరాడాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ గౌరవాధ్యక్షురాలు ఎం.ఉమామహేశ్వరి కోరారు. పట్టణంలోని గారమ్మగుడి ఆవరణలో జి.జెస్సీబాయి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. స్కీమ్ వర్కర్లందరికీ కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని కోరారు. జూలై 9న జరిగే సమ్మెను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.హిమప్రభ, బి.అమరవేణి, ఎస్.గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల సవరణతో నష్టం

పాలకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌కు వత్తాసు పలుకుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక చట్టాలకు సవరణలు చేసిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ చట్టాల సవరణ వల్ల రాష్ట్రంలోని ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో పనిచేస్తున్న 50 లక్షలమంది కార్మికులు నష్టపోతారన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం స్కేల్ అమలు చేయడం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న రోజుకు 8గంటల పనిదినాలు మార్చేహక్కు ప్రభుత్వానికి లేదన్నారు. వీటన్నింటినీ కార్మికవర్గం వ్యతిరేకించి ఐక్యంగా పోరాడాలన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

క్షతగాత్రులకు ప్రభుత్వ విప్ పరామర్శ



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాతుగుడబ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు మండంగి కుంబు, మండంగి గౌరీ శనివారం పిడుగుపాటుకు గురై పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆదివారం ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం చేశారు. వారి ఆరోగ్య పరిస్థితులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

శతాధిక వృద్ధుడి కుటుంబానికి పరామర్శ

వీరఘట్టం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టానికి చెందిన 110 సంవత్సరాల వృద్ధుడు రామలింగేశ్వరుడు గురువారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదివారం ఆయన కుమారులైన సురేష్, విశ్వనాథంలను పరామర్శించారు. ఎంతో ఆరోగ్యంగా 110 సంవత్సరాలు జీవించారని, కళ్లద్దాలు లేకుండా పేపర్ చదివేవారని ఎమ్మెల్యేకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, చింతా ఉమ, జామి లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు, తూముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏడాది పాలన వేడుకలు



లబ్ధిదారులకు సహాయక కార్డులు అందజేస్తున్న మంత్రి జెన్నా

రాయగడ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పారుల్ పట్వారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య, రవాణా, ఉక్కు, గనుల శాఖ మంత్రి, రాయగడి జిల్లా ఇన్‌చార్జి బిభుతి భూషన్ జెన్నా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్పడి ఒక ఏడాదిలోపే ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అనంతరం అర్హులందరికీ వివిధ సహాయక కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టక్ నవీన్‌చంద్ర నాయక్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జడ్పీ ముఖ్య కార్యనిర్వాహణాధికారి అక్షయ్‌కుమార్, ఖెముండు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా

కూలితే గానీ పట్టించుకోరా?

- శిథిలావస్థలో పాఠశాల పాత భవనం
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనం

మక్కువ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కిందట నిర్మించిన మక్కువ జడ్పీ ఉన్నత పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. మరోవైపు పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు శిథిలావస్థకు చేరిన పాఠశాల పక్క నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. శిథిలావస్థ భవనం నూతన పాఠశాల భవనాల మధ్యన ఉండడంతో ఎప్పుడు ఏమవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా పాఠశాల భవనాలకు కొరత లేదు. ఇటీవలే నూతనంగా నిర్మించిన పాఠశాల భవనంలోనే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన పాత పాఠశాలను తొలగించకపోవడం ఏమిటని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాలు ప్రారంభం కావడంతో పాటు సుమారు 800 మంది విద్యార్థులు శిథిలావస్థ భవనం చుట్టుపక్కలే తిరుగుతూనే ఉండడంతో విద్యారుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాల భవనం తొలగిస్తే క్రీడా మైదానానికి కొంత వెసులుబాటు ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి శిథిలావస్థ పాఠశాల భవన నిర్మాణం తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ



సాలూరు: చెక్కులను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం సాలూరులోని తన స్వగృహంలో లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం రూ.3 లక్షల 62వేల 917ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని 11వ వార్డు చినహరిజనపేటకు చెందిన దివాకల తులసికి రూ.49,258, ఏడో వార్డు గాంధీనగర్‌కు చెందిన చింత వాసుదేవకు రూ.47,642, 21వ వార్డు తెలగావీధికి చెందిన వానపల్లి రమణమ్మకు రూ.50వేలు విలువైన చెక్కును అందజేశారు. అలాగే పాచిపెంట మండలంలోని మోసూరుకు చెందిన బొట్టా గౌరీశంకరరావుకు రూ.30,700, మెంటాడ మండలం బాడేవలసకు చెందిన నీలిరోతు ప్రశాంత్‌కు రూ.85వేలు, మక్కువ మండలం పనసభద్రకు చెందిన కోట శేషగిరిరావుకు రూ.లక్షా 317ల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి నియోజకవర్గం పరిధిలో..

బొబ్బిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గం పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బేబీనాయన అందజేశారు. ఆదివారం బొబ్బిలి కోటలోని తన క్యాంపు కార్యాలయంలో రూ.10లక్షల విలువగల చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. గొర్లె సీతారాంపురం గొర్లె వెంటకరమణకు రూ.2.70లక్షలు, తెంటువలస గొదబ రాజా రమేష్‌కు రూ.1.69 లక్షలు, సుందరాడ ముత్త సత్యంకు రూ.లక్ష, కొట్టక్కి లక్ష్మీపట్నాయక్‌కు రూ.68వేలు, గొల్లపల్లి పైల సీతారాంకు రూ.55వేలు, 15 వవార్డు రాంబార్కి ప్రసన్నకు రూ.45వేలు, కోడూరు కొల్లి రమణమ్మకు రూ.45 వేలు, కోమటిపల్లి ఆవాల రమణమ్మకు రూ.40వేలు, చెలికాని రాధకు రూ.36వేలు, శిస్టు సీతారాంపురం బొత్స రామసాయికి రూ.35వేలు, పాతరేగ వైకుంఠం వెంకటనాయుడుకు రూ.35వేలు, పి.వెంకంపేట మూడడ్ల పైడితల్లికి రూ.28వేలు, కలవరాయి కోరాడ గణేశ్‌కు రూ.25 వేలు, అలజంగి గ్రామానికి చెందిన రెడ్డి రాములుకు రూ.24వేలు చొప్పున మంజూరవడంతో ఆ కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఈ చెక్కులను అందజేశారు.

ఆలయం వద్ద తాత్కాలిక పనులు

కురుపాం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం పడిన వర్షానికి స్థానిక త్రినాథస్వామి దేవాలయంలోకి మురుగునీరు చేరడంతో దినపత్రికల్లో వచ్చిన వార్తకు గ్రామపెద్దలు స్పందించారు. దేవాలయంలోకి నీరు వెళ్లకుండా ఆదివారం తాత్కాలిక పనులు చేట్టారు. ఇప్పటికైనా సక్రమంగా పనులు నిర్వహించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలుగు యువత అధికారి ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్, కేవీ కొండయ్య, నెల్లి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కర్రి శ్రీనివాసరావు, కోట బుజ్జి.. ఆర్‌అండ్‌బీ జేఈ సుశీలకు సూచించారు. జేఈ మాట్లాడుతూ ఆక్రమణదారులు అడ్డుకోవడంతో సక్రమంగా పనులు జరగడం లేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరిస్తే పనులు సక్రమంగా నిర్వహిస్తామని చెప్పారు.

వృద్ధులపై కరుణ చూపండి



మాట్లాడుతున్న దామోధరరావు

గరుగుబిల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వృద్ధులపై కరుణ చూపాలని జిల్లా అదనపు న్యాయా ధికారి ఎస్.దామోధరరావు సూచించారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉల్లిభద్ర గ్రా మంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వృద్ధులకు వైద్య సంరక్షణతో పాటు జీవన ప్రమాణాలు పొందే హక్కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జి.సౌమ్యజోస్పిన్, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, న్యాయవాది బి.సత్యనారాయణ, సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ ఎం.తవిటినాయుడు, ఎస్ఐ పి.రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

సీతానగరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ తెలిపారు. మండలం లోని చినభోగిలి, బూర్జ, మరిపివలస గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయని, కాలువల్లో పూడికలు తీయాలని, వీధుల్లో పిచ్చిమొక్కలు తొలగించాలని సూచించారు. దోమల నివారణ మందు కూలీలతో పిచికారీ చేయిస్తున్నామని చెప్పారు.

● రామభద్రపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు ఆరికతోట పీహెచ్‌సీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మల్లికేశ్వరరావు తెలిపారు. మండలంలో ఉన్న గిరిజన గ్రామాల్లో ఆదివారం దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. కాలువలు, ఇళ్లల్లో కూడా ఈ దోమల మందులను స్ప్రే చేయించారు. గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ బలరాం, హెల్త్ అసోషియేట్ మధు పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ పరిశీలకుల నియామకం

గరుగుబిల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు నియోజకవర్గ స్థాయి పరిశీలకులను నియమించారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావును సాలూరు పరిశీలకుడిగా నియమించారు. ఈయనతో పాటు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ కిమిడి నాగార్జునను రెగ్యులర్ పరిశీలకుడిగా, పార్వతీపురానికి చెందిన బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడును ఎన్నికల పరిశీలకుడిగా నియమించారు. ● పాలకొండ: కురుపాం నియోజకవర్గ పరిశీలకుడిగా టీడీపీ పాలకొండ మండల అధ్యక్షుడు గండి రామినాయడును, పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకురాలిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, టీపీసీ సభ్యురా లు ఎం.తేజోవతిలను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈసందర్భంగా వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘాన్ని బలోపేతం చేసుకుందాం



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురావు

పార్వతీపురంటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని విధాలుగా వెనుకబడి ఉన్న తమ సంఘాన్ని బలోపేతం చేసుకుందామని విశ్వబ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.హనుమంతురావు అన్నారు. పట్టణంలోని బైపాస్ రహదారిలో గల ఆ సంఘ భవనంలో ఆదివారం జరిగిన జిల్లా విశ్వబ్రాహ్మణ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అవుతున్నా ప్రభుత్వాలు తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్పా న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్రంలోని 25 లక్షల మందికి పైగా విశ్వబ్రాహ్మణులు ఉన్నప్పటికి కనీసం గుర్తించే వారే కరువయ్యారన్నారు. 2 నెలల్లోగా 27 జిల్లాల్లో ఉన్న విశ్వబ్రహ్మణ జనగణనకు సంబంధించి సంఘ సభ్యులే బాధ్యత తీసుకోవాలన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు, ఉద్యోగ సంఘ అధ్యక్షుడు పి.వీరాచారి, జిల్లా నాయకులు బి.శంకరరావు, ఎం.సందీప్, సీహెచ్.తవిటిరాజు, పి.గౌరీశంకరరావు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మినేని, కృష్ణంరాజులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పాలకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై తప్పుగా మాట్లాడిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను కఠినంగా శిక్షించాలని అరకు పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు వారాడ సుమంత్‌నాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మహిళలను కించపరిచి డిబేట్‌లు నిర్వహించడం తగదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో పార్టీ నాయకులు ముంజేటి త్రినాథరావు, అల్లు బుల్లిబాబు, అల్లు శ్రీనివాస రావు, మచ్చ వైకుంఠరావు, కనపాక ధనుంజయ్, గురుబిల్లి దిలీప్, కిమిడి రామకృష్ణ, లావేటి చంద్రం, కిమిడి సంగంనాయుడు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల ఎంపికకు శిక్షణ

పాలకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు స్థానిక సీఎల్‌నాయుడు కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం శిక్షణ ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వెన్నపు చం ద్రశేఖర్, కబడ్డీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పల్లా కొండలరావు విలేకర్లతో మాట్లాడారు. అండర్-18 ఎంపిక ఈనెల 24వ తేదీ నుంచి జరుగుతుందన్నారు. 22 మందికి శిక్షణ ఇచ్చినా 14 మందిని ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో ఇక్కడే కబడ్డీ పోటీలు పెట్టేలా ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ట్రెజరర్ గార లక్ష్మణరావు, కోచ్ సితేంద్రకుమార్, జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా రిఫరీ బోర్డు ఛైర్మన్ కాయల రమేష్ తదితరులు ఉన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం



పాలకొండ: యోగాసనాలు వేస్తున్న సాధకులు

పాలకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగా శిక్షకుడు కె.జనార్ధనరావు అన్నారు. ఆదివారం స్థానిక రుషియోగా కేంద్రంలో ఆయన యోగా సాధకులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ఒక గంట సమయం యోగాకు కేటాయించాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమవుతుందన్నారు. ● బొబ్బిలి: స్థానిక బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో ఆదివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకురాలు పూసర్ల నళిని అందరితో యోగాసనాలు, ప్రాణాయామం చేయించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలేవీ?

- పంట పొలాలకు మార్గం లేక ఇబ్బంది పడుతున్న రైతులు
- స్పందించని అధికారులు



గిజబలో ఆక్రమణలకు గురైన స్థలం

గరుగుబిల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిజబ గ్రామంలో అధికంగా ఆక్రమణలు నెలకొనడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఒకవైపు పంచాయతీకి సంబంధించి డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. డ్రైనేజీలకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలను పలువురు ఆక్రమించి నిర్మాణాలతో పాటు పెంట కుప్పలు, పెరటి తోటలు వేసుకున్నారు. దీంతో పంట పొలాలకు వెళ్లేందుకు మార్గం లేక గ్రామానికి చెందిన రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే రహదారికి ఆనుకుని వ్యర్థాలు, పెంటలు కారణంగా దోమలు విజృంభణ అధికంగా నెలకొనడంతో పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఆర్‌అండ్‌బీకి చెందిన స్థలాన్ని పలువురు ఆక్రమించుకుం టున్నా అధికారులు స్పందన లేదని రైతులు వాపోతున్నారు. మొత్తం రహదారికి ఆనుకుని ఆక్రమణలు నెలకొనడంతో వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. రైతులకు చెందిన సొంత భూములకు వెళ్లాలంటే మార్గం లేక సతమతమవుతున్నారు. ఆక్రమణదారులు సొంత స్థలాల్లా వ్యవహరించి ప్రశ్నించే వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఆక్రమణలను తొలగించి పంట పొలాలకు మార్గం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

పిడుగు పాటుకు ఆవు మృతి

పాలకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఆర్‌పేట గ్రామంలో తాడేల కిశోర్ అనే రైతుకు చెందిన ఆవు పిడుగుపాటుకు మృతి చెందింది. శనివారం ఆవు ఇంటికి చేరకపోవడంతో రాత్రి అంతా వెతికారు. ఆదివారం ఆవు మృతదేహం కనిపించింది. పిడుగు పాటుకు మృతిచెందినట్టు గుర్తించారు. ఆవు ఏడు నెలల చూలుతో ఉందని కిశోర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్పందించి పరిహారం అందజేయాలని ఆయన కోరారు.

అర్హులందరికీ తల్లికి వందనం

గరుగుబిల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు, రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కే దక్కుతుందన్నారు.

నేడు 'మీ కోసం'

సీతంపేట రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని ఐటీడీఏ అధికారులు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం గిరిజనులు పీజీఆర్ఎస్‌ను ఆశ్రయించవచ్చునని సూచించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

సాలూరు ఏజెన్సీలో వర్షం

సాలూరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఏజెన్సీలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపంతో ఇబ్బందిపడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. మొక్కజొన్న రైతులు తమ పంటను కాపాడుకోవడానికి పాట్లు పడ్డారు.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

సాలూరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు సూచించారు. జీగిరాం గ్రామానికి చెందిన పసుపు పరిశ్రమ యాజమానురాలు అల్లాడి సునీతకు పాప్సీ అవార్డు దక్కిన నేపథ్యంలో ఆయన ఆమెను అభినందించారు. ఆదివారం జీగిరాం విచ్చేసిన ఆయన ఆమె అభినందించి, సత్కరించారు. సురక్షిత ఆహార డైటీషియన్ స్వర్ణలత, కొల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అవార్డు గ్రహీతకు సత్కారం



జేసీ రాజు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

బొబ్బిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్టీఆర్ అవార్డును అందుకున్న రోటరీ, కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జేసీ రాజు దంపతులను స్థానిక కళింగవైశ్య భవనంలో ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. రోటరీక్లబ్ ప్రతినిధి జేసీహెచ్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు పాల్గొని, ఆయన సేవలను కొనియాడారు. రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసన్, శివకాంత్, మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవరావు, చార్టెర్డ్ అకౌంటెంట్ జేసీహెచ్ నారాయణమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.